## త్రైత సిద్ధాంత భగవద్గీత ప్రచారం

చెన్నేకొత్తపల్లి, డిశంబర్, 24 ప్రభాతవార్త



గ్రామాలలో భగవద్గీత ప్రచారం చేస్తున్న దృశ్యం

మార్గశిర మాసం (ధనుర్మాసం)ను పురస్కరించుకుని త్రైత సిద్ధాంతం ప్రబోధ సేవా సమితి ఇందూ జ్ఞాన వేదిక ధర్మవరం కమిటీ, సభ్యు లఆధ్వర్యంలో, త్రైత సిద్ధాంత భగవద్గీత అలాగే అనుబంధ ఆధ్యాత్మిక గ్రంథాలను, మంగళవారం, శ్రీ సత్య సాయి జిల్లా, చెన్నేకొత్త పల్లి మండలం లోని కనుముక్కల, కేశాపురం , వెల్దుర్తి గ్రామాల్లో, త్రైత సిద్ధాంత భగవద్గీత గ్రంథముల ప్రచారం, నిర్వహించారు, ఈ సందర్భంగా కమిటీ అధ్యక్షులు, లక్ష్మీనారాయణ ఆచారి, మాట్లాడుతూ,మార్గశిర మాసంలో శిరము అనగా తల అని మార్గం అనగా దారి అని, తలలోనికి దారిఅనేవిధానం ఉన్నది అని ప్రతిఒక్కరూ తెలుసుకోవాలి, అన్నారు, దీపావళి పండుగ అర్థం ప్రకారం గురువు యొక్క జ్ఞానాగ్ని ని పొందిన శిష్యుడు కార్తీకమాసంలో దీపపువెలుగులో అనగా యోగమార్గంలో ప్రయాణించిన శిష్యుడు ఇక్కడ మార్గశిర మాసంలో తలలోని ఆత్మ వద్దకు చేరుటకు సులభముగా దారిఏర్పడుతుంది అనేందుకు గుర్తుగా ఉంది. కాబట్టి మార్గశిర మాసంలో ఎంతో భక్తి ప్రపత్తులతో ఉండాలి, దైవభక్తితో గ్రంథ పఠనంతో జ్ఞానంలో ఉండాలని ప్రబోధించారు.. మార్గం లో ప్రయాణించి జీవుడు తాను శూన్య మాసమైన ధనుర్మాసం లో గురువును శరణు వేడి తాను శూన్యంగా మిగిలిపోతే ఉత్తరాయణంలో మోక్షంనకు చేరగలడన్నారు. కార్యక్రమంలో త్రైత సిద్ధాంతంప్రబోధ సేవాసమితి ఇందూ జ్ఞానవేదిక ధర్మవరం కమిటీటీ అధ్యక్షులు,సభ్యులు కె.లక్ష్మీనారాయణ ఆచారి, భాస్కర్ సాధు, శివమ్మ, ఈశ్వరమ్మ, కృష్ణవేణి, సునీత, శారద, గంగాదేవి, చౌడేశ్వరి, త్రైతేశ్వరి, బి.చంద్రశేఖర్, మోహనకృష్ణ లు పాల్గొన్నారు.

## జర్నలిస్టుల సంక్షేమానికి ప్రాధాన్యత ..!

మడకశిర టౌన్, డిసెంబర్ 24 ప్రభాతవార్త



నూతనంగా ఎన్నికైన ఏపీయూడబ్ల్యూజే కమిటీ సభ్యులు

జర్నలిస్టుల సంక్షేమానికి అధిక ప్రాధాన్యత కల్పిస్తూ వారికి అన్ని విధాలుగా అండగా నిలుస్తామని జిల్లా ఏపిడబ్ల్యూజే కమిటీ అధ్యక్షులు పుల్లయ్య, సెక్రటరీ బాబులు తెలిపారు. మంగళవారం సాయంత్రం మడకశిర ఆర్ అండ్ బి విశ్రాంతి భవనంలో మడకశిర డివిజన్ జర్నలిస్టుల నూతన కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎంపిక చేశారు. ఈ సందర్భంగా ఏపీడబ్ల్యూజే యూనియన్ కమిటీ సభ్యులు మాట్లాడుతూ ప్రభుత్వపరంగా జర్నలిస్టులకు కల్పించే సౌకర్యాలను కల్పించడానికి తమ వంతు కృషి చేస్తామన్నారు. అదేవిధంగా అర్హత ఉన్న జర్నలిస్టులకు అక్రిడేషన్ కార్డు మంజూరు చేయిస్తామన్నారు. విద్య,వైద్య,ల పరంగా ప్రత్యేక చర్యలు తీసుకొని మెగా హెల్త్ క్యాంపుతో పాటు అక్రిడేషన్లు కలిగిన వారికి పక్కా గృహాలు సౌకర్యాలను కల్పించడానికి కృషి చేస్తున్నామని వారు గుర్తు చేశారు. మడకశిర డివిజన్ ఏపీడబ్ల్యూజేయు నూతన కార్యవర్గాన్ని సమిష్టిగా ముందుకు తీసుకువెళ్లి అభివృద్ధి చేసుకోవాలన్నారు. అదేవిధంగా జర్నలిస్టులకు ఎదురయ్యే ప్రధాన సమస్యల పరిష్కారానికి ఎల్లవేళలా ముందుంటామన్నారు. జర్నలిస్టుల కష్టసుఖాల్లో కూడా తమ వంతు సహకారం ఉంటుందన్నారు. అనంతరం నూతనంగా ఎన్నికైన ఏపీడబ్ల్యూజే యూనియన్ అధ్యక్షులతోపాటు కార్యవర్గ సభ్యులు. జిల్లా కమిటీ సభ్యులను సన్మానించారు. అదేవిధంగా నూతన కమిటీ సభ్యులను వారు అభినందిస్తూ సన్మానించారు. విలేకరుల సంక్షేమానికి కార్యవర్గ సభ్యులు తమ వంతు కృషి చేస్తూ అండగా ఉండాలన్నారు .

## ఉచిత గర్భకోశ చికిత్సశిభిరం

రామగిరి, డిసెంబర్ 24 ప్రభాతవార్త



ఉచిత గర్భకోశ చికిత్స శిబిరంను నిర్వహిస్తున్న దృశ్యం

పెయిదూడలు మాత్రమే ఇవ్వగలిగే లింగ నిర్ధారణ వీర్యం వినియోగం కొరకు ఉచిత గర్భకోశ చికిత్స శిబిరంను మండల పరిధిలోని కలికవాండ్లపల్లి గ్రామంలో ఉచిత గర్భకోశ చికిత్స శిభిరం ఏర్పాటు చేశారు. ఇందుకుగాను జిల్లా పశుగణాభివృద్ధి సంస్థ ఉచిత మందులను సైతం సరఫరా చేశారు. 90 శాతం కచ్చితత్వంతో పేయి దూడల పుట్టుకను ఉద్దేశించి లింగ నిర్ధారిత వీర్యంతో కృత్రిమ గర్భధారణ చేయు పథకం ప్రాచుర్య నిమిత్తం, ఆ పథకానికి మంచి పశువుల ఎన్నికకు, రైతుల అవగాహన క ఒరకు, గ్రామంలో అన్ని పశువులను పరీక్షించుట కొరకు ఉచిత గర్భకోశ చికిత్స శిభిరము ఏర్పాటు చేయడమైంది. మొత్తం పేయిదూడలను పొందే ఈ లింగ నిర్ధారిత వీర్యం సూదులను ప్రభుత్వం సరఫరాచేస్తుందని తెలిపారు. ఈ సందర్భంగా జిల్లా పశుగణాభివృద్ధి సంస్థ కార్యనిర్వహణ అధికారి, డిప్యూటీ డైరెక్టర్ డాక్టర్ సుధాకర్ మాట్లాడుతూ.. భవిష్యత్తులో ఈ లింగ నిర్ధారిత వీర్యం అత్యధిక ప్రాచుర్యం పొందుతుందని, గ్రామములో అత్యధిక పాడి కొరకు పేయిదూడలు మాత్రమే పొందే ఆధునిక సాంకేతిక విప్లవముగా ఈ పథకం మారగలదని ఆశాభావం వ్యక్తం చేశారు. పశువులలో చూడి నిర్ధారణ, తిరిగి ఎదకు వస్తూ కట్టకుండా నిలిచిపోయినవి, పూర్తిగా ఎదకు రానివి లాంటి సుమారు 37 పశువులకు గర్భకోశ వ్యాధుల నిపుణులు డాక్టర్ టివి.సుధాకర్ గర్భకోశ పరీక్షలు నిర్వహించారు. నట్టల నివారణ మందులు 15 వాటికి తాపారు, సాధారణ కేసులు 10 చూసి వాటికి తగు వైద్యం అందించి, సలహాలు సూచనలు ఇచ్చారు. కార్యక్రమంలో గ్రామ పెద్దలు, డాక్టర్ టివి సుధాకర్, జిల్లా పశుగణాభివృద్ధి సంస్థ, అనంతపురం వారు, డాక్టర్ డి.మౌలాలి బాషా, పశువైద్యులు, రామగిరి, ఎహెచ్ఎ, జిఎం తదితరులు పాల్గొన్నారు.

## అక్రమంగా ఇసుకను తరలిస్తే చర్యలు

బత్తలపల్లి, డిసెంబర్ 24 ప్రభాతవార్త



పోలీసుల అదుపులో ఉన్న టిప్పర్

మండలం నుండి అనుమతులు లేకుండా అక్రమంగా ఇసుకన తరలిస్తే కఠిన చర్యలు తప్పవని ఎస్సై సోమ శేఖర్ హెచ్చరించారు. మంగళవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ తనకుసమాచారం రావడంతో సిబ్బందితో కలసి దాడులు చేశామన్నారు. అనంతపూర్ రోడ్డులోని నేషనల్ హైవే 42వైజంక్షన్‌వద్ద కాపుకాచి అదుపులోకి తీసుకున్నామన్నారు. రామాపురం నుండి అనంతపురం టౌన్‌కు అక్రమంగా ఇసుక తరలిస్తున్న అనంతపురం టౌన్‌కు చెందిన ఇసుక టిప్పర్‌ను స్టేషన్‌కు తరలించి కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

## అమరాపురం నూతన ఎస్సైగా ఇషాక్ బాషా

అమరాపురం డిసెంబర్ 24 ప్రభాతవార్త



అమలాపురం మండలానికి నూతన ఎస్సైగా ఇషాక్ బాషా మంగళవారం బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలంలో శాంతి భద్రతల పరిరక్షణ కోసం ఎల్లవేళలా కృషి చేస్తామన్నారు. అదేవిధంగా మండలంలో ఏ గ్రామంలోనైనా అసాంఘిక కార్యక్రమాలకు పాల్పడిన మట్కా గ్యాంబ్లింగ్ జూదం జరుగుతున్న వీటి నిర్మూలన కోసం గట్టి నిఘాఉంచి కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. మండలంలో శాంతి పద్యతలను కాపాడడానికి మండల ప్రజలు సహకరించాలని ఆయన కోరారు.

## హంద్రీనీవా కాలువ మరమ్మత్తు పనులకు కోటి 20లక్షలు మంజూరు

### మంత్రి సవితమ్మ,బాలకృష్ణ చొరవతో కాలువ పనులు పనులు ప్రారంభించిన తేదేపా నాయకులు వెంకటేశ్వరరావ్




పనులు ప్రారంభిస్తున్న దృశ్యం

సోమందేపల్లి డిసెంబరు 24, ప్రభాతవార్త

ఎన్నో ఏళ్లుగా మరమ్మతులకు నోచుకోక హంద్రీనీవా కాలువ పనులు ఎక్కడ వేసిన గొంగళి అక్కడే ఉన్న విధంగా నిలిచిపోయాయి. రైతులు కష్టాలు కన్నీరు పంటలు పండగ కడగండ్లుగా మిగిలిపోయాయి. సోమందేపల్లి ఆయకట్టుకు సంబంధించి సుమారు 500 ఎకరాలు వరి, రాగి, సజ్జలు పండిస్తారు. చెరువులో, హంద్రీనీవా కాలువలో సమృద్ధిగా నీరు ఉన్న నీరు పారుతున్న అన్నదాతకుకన్నీళ్లు మిగిలాయి. మండల కేంద్రంలోని హంద్రీ నీవా కాలువకు మరమ్మత్తులు (గండ్లు పూడుక) చేయకపోవడంతో నీరు వృధాగా పోయి సగానికి పైగా పొలాలలో నీరందక పంటలు పండక బీడు భూములుగా మారాయి. ఈ నేపథ్యంలో హంద్రీ నీవా కాలువ మరమ్మత్తు పనులు పనులు ప్రారంభించారు సీనియర్ తేదేపా నాయకులు వెంకటేశ్వరరావ.మంగళవారం ఉదయం నక్కలగుట్ట సమీపంలోని హంద్రీ నీవా కాలువ వద్ద హిటాచికి పూజలు చేసి,పనులు ప్రారంభించారు బిసి సంక్షేమ,చేనేత,జౌళి శాఖామంత్రి సవితమ్మ భర్త,తేదేపా నాయకులు వెంకటేశ్వరరావ్, హిందూపురం పార్లమెంటు కార్యవర్గ సభ్యులు నీరు గంటి చంద్రశేఖర్లు. గతకొద్దిరోజులుగా రైతులు తమసమస్యను మంత్రి సవితమ్మ, హిందుపురం ఎమ్మెల్యే బాలకృష్ణ దృష్టికి తీసుకెళ్ళగ,వెంటనే స్పందించిన మంత్రి సవితమ్మ ఎమర్జెన్సీ నిధుల క్రింద ఒక కోటి ఇరవై లక్షలు మంజురూ చేయించారు.,ఆ పనులు బుధవారం నీటి పారుదల అధికారులు,కాంట్రాక్టర్ నడుమ కాలువ మరమ్మత్తు పనులు ప్రారంభమయ్యాయి.ఇందులో భాగంగ నాయకులు వెంకటేశ్వరరావ్ మాట్లాడుతు సోమందేపల్లి నుండి హిందుపురం వరకు,హంద్రీనీవా కాలువకు 8చోట్ల గండ్లు పడ్డాయని,వాటినిగుర్తించి వెంటనే మరమ్మత్తు చేసి,కాలువ ద్వారా రైతుల పంట పొలాలకు నీరు అందించే ప్రక్రియ మొదలుపెట్టారు.అన్నదాత కన్నీరు పెట్టకూడదని మంత్రి సవితమ్మ సంకల్పించారని15 రోజులలో గండ్లూ పూడ్చడం,కాలువ మరమ్మత్తు పనులు పూర్తి చేస్తామన్నారు.ఇందులో భాగంగ హిందుపురం పార్లమెంటు తేదేపా కార్యదర్శి నీరుగంటి చంద్రా మాట్లాడుతు ప్రజలు,రైతులు,కార్మికులు అందరి మంచే కోరే మంత్రి సవితమ్మ ఆదేశాలతో ఈ పనులు చేపట్టారని,కూటమి ప్రభుత్వం అభివృద్ధే ధ్యేయంగ పని చేస్తోందని,త్వరలో హంద్రీనీవా కాలువ ద్వారా రైతుల పంట పొలాలకు నీరు అందిచడం జరుగుతుందని,సియం చంద్రబాబునాయుడు,మంత్రి లోకేష్,ఎమ్మెల్యే బాలకృష్ణ,మంత్రి సవితమ్మలకు రైతుల తరుపున ధన్యవాదాలు తెలుపుతున్నాం అన్నారు.ఈ కార్యక్రమంలో పట్టణ అధ్యక్షుడు వడ్డే సూరి,మద్దలేటి,పెద్దకోడిపల్లి ప్రకాష్,గణేష్,రైతులు,తేదేపా కార్యకర్తలూ పాల్గొన్నారు.

## పెనుగొండ నియోజకవర్గ ఎలక్ట్రానిక్ మీడియా అధ్యక్షుడిగా టీవీ 5 మధుసూదన్

సోమందేపల్లి డిసెంబర్ 24 ప్రభాతవార్త



ఎలక్ట్రానిక్ మీడియా అధ్యక్షుడు టీవీ5 మధును అభినందిస్తున్న దృశ్యం

పెనుగొండ నియోజకవర్గ ఎలక్ట్రానిక్ మీడియా అధ్యక్షుడిగా టీవీ5 మధు మంగళవారం జరిగిన కార్యక్రమంలో ఏకగ్రీవంగా ఎంపికయ్యారు. పెనుగొండ లోని త్రిపుర రీసార్ట్లో ఏపీయూడబ్ల్యూజే జిల్లా అధ్యక్షులు పుల్లయ్య నాయకత్వంలో జరిగిన ఎన్నిక అందరి ఆమోదంతో ఏకగ్రీవంగా జరిగింది. ఈ సందర్భంగా నియోజకవర్గంలోని ఎలక్ట్రానిక్ మీడియా అధ్యక్షులుగా టీవీ 5 మధుసూదన్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఉపాధ్యక్షులుగా హరి, చరణ్ రాజు,కార్యదర్శిగాసాక్షి మురళీధర్, గౌరవాధ్యక్షులుగా టీవీ9 అరుణ్ ఎన్నికయ్యారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మీడియా సమస్యలపై పరిష్కారానికి కృషి చేస్తామని, కమిటీ ఏపీడబ్ల్యూజే కమిటీలు తో మమేకమై జర్నలిస్టు అభివృద్ధికి నిరంతరం కృషి చేస్తామని పేర్కొన్నారు. కార్యక్రమంలో మీడియా ప్రతినిధులు పాల్గొన్నారు.

## మొక్కజొన్న పంట సాగులో మెలకువలు

బుక్కపట్నం డిసెంబర్ 24 ప్రభాతవార్త

మండలంలోని పాముదుర్తి రెవెన్యూ వెంకటాపురం గ్రామంలో పొలం పిలుస్తుంది కార్యక్రమం నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమమునకు ముఖ్య అతిథిగా జిల్లా వనరుల కేంద్రం పుట్టపర్తి డిప్యూటీ డైరెక్టర్ ఆఫ్ అగ్రికల్చర్ శ్రీ జె. సన్నావుల్లా గారు రైతులు సాగు చేసే పంటలైన వరి, వేరుశనగ మరియు మొక్కజొన్న పంటలలో మేలైన సాగు పద్ధతులు, ఎరువుల యాజమాన్యం మరియు చీడపీడల నివారణ గురించి రైతులకు తెలియజేయడం జరిగినది. మొక్కజొన్నలో కత్తెర పురుగు నివారణకు స్పైనోసాడ్ పురుగుల మందు ఎకరాకు 60 ఎమ్ ఎల్ తో పాటు వేప నూనె ఒక లీటరు తప్పనిసరిగా పిచికారి చేయాలని రైతులకు సూచించడం జరిగినది వేరుశనగ పంట పూత దశలో ఉన్నందున జిప్సం ఎకరాకు 200 కేజీలు తేమ ఉన్నప్పుడు వేయాలని తెలియజేయడం జరిగినది తదుపరి రైతు ఈ గంగులప్ప మొక్కజొన్న పంటను సందర్శించి తగు సూచనలు సలహాలు ఇవ్వడం జరిగినది. ఈ కార్యక్రమంలో మండల వ్యవసాయ అధికారి శ్రీ ఎస్ సతీష్ బాబు, వ్యవసాయ విస్తరణ అధికారి సునీత, రైతు సేవ కేంద్రం సిబ్బంది అభినయ్ కుమార్ మరియు రైతులు పాల్గొన్నారు.

## టీడీపీ దాడిలో గాయపడిన వారికి కొత్తకోట చక్రధర రెడ్డి పరామర్శ

బుక్కపట్నం డిసెంబర్ 24 ప్రభాతవార్త

రెండు రోజుల క్రితం బుక్కపట్నం మండలం బిట్రగుంటపల్లికి చెందిన ఎల్లప్ప, ఉత్తప్ప, కేశవయ్య భార్య నాగలక్ష్మి, ఎల్లప్ప కుమారుడు సాయి కుమార్‌లను టీడీపీకి చెందిన కొందరు కార్యకర్తలు వీరిపైవిచక్షణ రహితంగా, అదేపనిగా కలగచేసుకొని దాడి చెయ్యడం జరిగింది. నలుగురు అనంతపురం ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారు. విషయం తెలుసుకున్న పార్టీ యూత్ జోనల్ ఇంచార్జ్ కొత్తకోట చక్రధర రెడ్డి ప్రభుత్వ ఆసుపత్రి కి వెళ్లి వీరిని పరామర్శించారు. ముఖ్యంగా నాగలక్ష్మికి, సాయి కుమార్‌కి తీవ్ర గాయాలు అయ్యాయి. అక్కడే ఉన్న డ్యూటీ డాక్టర్ మరియు నర్సులను వారి పరిస్థితి గురించి అడిగి తెలుసుకున్నారు. వారు త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు. కొత్తకోట పంచాయితీలో ఈపనిచేసిన కొందరు టీడీపీ కార్యకర్తలపై తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేసారు. పోలీస్ శాఖ వారు ఈకేసుపై విచారణజరిపి బాధితులకు న్యాయంజరిగేలా చూడాలన్నారు. రోజురోజుకి ఇలాంటి దాడులు ఎక్కువ అవ్వడం పట్ల విచారణ వ్యక్తం చేసారు. బాధితులకు అన్ని విధాలా అండగా ఉంటామని భరోసానిచ్చారు.

## రైలు కిందపడి గుర్తుతెలియని వ్యక్తి మృతి

గుత్తి, డిసెంబర్ 24 ప్రభాతవార్త



గుర్తుతెలియని వ్యక్తి మృతి చెందిన దృశ్యం

గుత్తి పట్టణ శివారులోని తురకపల్లి సమీపంలో రైల్వే ట్రాక్‌పై మంగళవారం 50 సంవత్సరాల వయసు వున్న గుర్తుతెలియని వ్యక్తి రైలు కిందపడి మృతి చెందాడు. ఇతను ఆత్మహత్యకు పాల్పడ్డాడా లేక ప్రమాదవశాత్తు మరణించాడా అన్నది పోలీసుల దర్యాప్తులో తెలియాల్సి వుంది. మృతుడు జంధ్యం వేసుకుని తెల్లదారంతో కూడిన మొలతాడు వేసుకుని వున్నాడు. ఈ సంఘటనపై రైల్వే జిఆర్‌పి ఎస్ఐ నాగప్ప కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

## పదవి బాధ్యతలు స్వీకరించిన జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారిని



కలెక్టర్కు పుష్పగుచ్ఛం అందజేస్తున్న నూతన జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారిని

సత్య సాయి జిల్లా వైద్యము డిసెంబర్ 24 ప్రభాతవార్త:

అన్నమయ్య జిల్లా వాయల్పాడు కమ్యూనిటీ హెల్త్ సెంటర్ లో డిప్యూటీ సివిల్ సర్జన్ గా పనిచేస్తున్న డాక్టర్ ఫైరోజా బేగం సివిల్ సర్జన్ గా పదోన్నతి చెంది శ్రీ సత్యసాయి జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారినిగా మంగళవారం ప్రశాంతి గ్రామంలో జిల్లా వైద్య ఆరోగ్యశాఖ కార్యాలయంలో పదవీ బాధ్యతలు స్వీకరించారు. జిల్లా కార్యాలయంలోని సిబ్బంది ఆమెకు అభినందనలు తెలిపారు. అనంతరం డాక్టర్ మంజు వాణి, డాక్టర్ ఫైరోజా బేగం జిల్లా కలెక్టర్ టీఎస్ చేతన్, జాయింట్ కలెక్టర్ అభిషేక్ కుమార్ లను మర్యాదపూర్వకంగా కలిసి వారికి పుష్పగుచ్ఛాన్ని అందజేశారు.

## తిరిగొచ్చిన కనబడకుండా పోయిన వివాహిత మహిళ

### -తహాశీల్దార్ ముందు హాజరుపర్చిన పోలీసులు

ఉరవకొండ, డిసెంబర్ 24 ప్రభాతవార్త



తహాశీల్దార్ ఎస్.మహబూబ్‌బాషా ముందు మల్లేశ్వరిను హాజరుపర్చిన దృశ్యం

ఈనెల 13వ తేదీ నుండి కనబకుండా పోయిన పట్టణానికి చెందిన వివాహిత మహిళ ఆకుల మల్లేశ్వరి తిరిగొచ్చింది. దీంతో ఉరవకొండ పోలీసులు ఆమెను మంగళవారం మండల తహశీల్దార్ ఎస్.మహబూబ్‌బాషా ముందు హాజరుపర్చారు. తానకు పిల్లలు కలగకపోవడంతో భర్త తన అంగీకారంతోనే మరో పెళ్లి చేసుకున్నాడని దీంతో తాను అమ్మ చెల్లెలుతో కలిసి పట్టణంలోని 10వ వార్డులో ఉంటూ కవితా సూపర్ మార్కెట్‌లో సేల్స్ ఉమెన్‌గా పనిచేస్తూ జీవనం సాగిస్తున్నానని అయితే తాను పనిచేసి దాచుకున్న డబ్బును అమ్మ ఇతరులకు వడ్డీకు ఇవ్వగా నాకు నా డబ్బులివ్వమని అడిగినందుకు అమ్మ, చెల్లెలు గొడవపడ్డారని దీంతో ఇళ్లు వదిలి వెళ్లిపోయానని మల్లేశ్వరి తెలిపారు. తాను అనంతపురంలోని ఒక ఇంట్లో పనిచేసుకొంటుండగా తాను కనబడకుండా పోయాయని మా అమ్మ పోలీసులకు పిర్యాదు చేసిందని పత్రికల్లో రావడంతో చూసి తిరిగి వచ్చానని తహాశీల్దార్ ముందు ఆమె వివరించారు.

## ఫుడ్ పాయిజన్‌తో పలువురికి అస్వస్థత

### -వాంతులు, విరేచనాలతో ఆసుపత్రిలో చేరిక





వాంతులు, విరేచనాలతో ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న వారి దృశ్యాలు

ఉరవకొండ, డిసెంబర్ 24 ప్రభాతవార్త

పట్టణంలోని బాలాజీ సినిమా హాల్‌కు ముందు వైపునగల ఎస్సీ కాలనీతోపాటు సత్యనారాయణ పేట, గాంధీ బజార్ ప్రాంతానికి చెందిన కోమలేశ్వరి, మమత, గోవిందమ్మ, జ్యోతి, అంజినమ్మ, రమేష్, మధు తదితరులతోపాటు మరో 10 మంది వరకు ఫుడ్ పాయిజన్‌తో అస్వస్థతకు గురయ్యారు. వాంతులు విరేచనాలతో బాధపడుతూ వారు స్థానిక ప్రభుత్వాసుపత్రిలో చేరగా వారికి చికిత్స అందిస్తున్నారు. స్థానిక భవాని ఆలయంలో సోమవారం ఉదయం జరిగిన అమ్మవారి మాలదారుల ఇరుముడి కార్యక్రమానికి హాజరైన వారు అక్కడ ఒక భక్తుడు చేయించుకొని వచ్చిన ఉగ్గాని, బజ్జీలు తిన్నారని, పలువురు తమ వెంట తీసుకెళ్లి తెలిసిన వారికి కూడా పెట్టారని సమాచారం. దీంతో ఉగ్గాని, బజ్జీలు తిన్నవారందరికీ వాంతులు, విరేచనాలు కావడంతో సోమవారం రాత్రి కొందరు, మంగళవారం ఉదయం మరికొందరు తీవ్ర అస్వస్థతకు గురై ఆసుపత్రిలో చేరారు. పలువురు కోలుకొని ఇళ్లకు వెళ్లగా మరికొందరు ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారు.

## అదుపుతప్పి బోల్తాపడిన డీజిల్ ఆటో

### -ఏడుగురు ప్రయాణీకులకు గాయాలు



ప్రమాదంలో గాయపడిన ప్రయాణీకులు

ఉరవకొండ, డిసెంబర్ 24 ప్రభాతవార్త

పట్టణంలోని మేజర్ గ్రామ పంచాయతీ సమీపంలో మంగళవారం మధ్యాన్నం జరిగిన రోడ్డు ప్రమాదంలో డీజిల్ ఆటో బోల్తా పడగా అందులో ప్రయాణిస్తున్న వారిలో ఏడుగురు గాయపడ్డారు. ఉరవకొండ నుండి ఆటో చిన్న, పెద్ద హోతూరుకు బయలుదేరగా ఆటో పంచాయతీ కార్యాలయం వద్దకు చేరుకోగానే ఎదురుగా వచ్చిన ద్విచక్రవాహనాన్ని తప్పించబోయి అదుపుతప్పి బోల్తా పడింది. దీంతో అందులో ప్రయాణిస్తున్న చిన్నహోతూరు, పెద్ద హోతూరుకు చెందిన లక్ష్మి, నందిని, ఎర్రమ్మ, రామలక్ష్మి, అక్షయ, కవిత, చిన్నెసుహెంది గాయపడ్డారు. గాయపడిన వారిని స్థానికులు ప్రభుత్వాసుపత్రికి తరలించగా ఇక్కడ ప్రాథమిక చికిత్స అనంతరం తీవ్రంగా గాయపడిన పలువురిని వైద్యుల సూచనల మేరకు మెరుగైన చికిత్సకై జిల్లా కేంద్ర ఆసుపత్రికి తరలించారు. ఘటనపై పోలీసులు వివరాలు సేకరించారు.

### మెరుగైన వైద్యం అందించాలని ఆదేశించిన మంత్రి:

కాగా ఆటో బోల్తా పడిన ప్రమాదంలో తీవ్రంగా గాయపడి అనంతపురం ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న ఎర్రమ్మ, లక్ష్మి, కవిత, మౌనికకు మెరుగైన వైద్యం అందించాలని రాష్ట్ర ఆర్థిక ప్రణాళిక, వాణిజ్య పన్నులు, శాసన సభ వ్యవహారాలశాఖ మంత్రి పయ్యావుల కేశవ్ ఆదేశించారు. ప్రమాద సమాచారం తెలిసిన వెంటనే ఆయన స్పందించి గాయపడిన వారి పరిస్థితిపై జిల్లా సర్వజన ఆసుపత్రి వైద్యులతో ఫోన్‌లో మాట్లాడారు.

## రెవెన్యూ సమస్యలు తమ దృష్టికి తీసుకురండి

పెనుకొండ డిసెంబర్ 24 ప్రభాతవార్త



రెవెన్యూ సదస్సులో మాట్లాడుతున్న తహసిల్దార్ శ్రీధర్

గ్రామాలలో ఉన్న రెవెన్యూ సమస్యలను తమ దృష్టికి తీసుకు వస్తే తక్షణమే పరిష్కరిస్తామని తహసిల్దార్ శ్రీధర్ తెలిపారు. మంగళవారం మండల పరిధిలోని గొంది పల్లి గ్రామంలో జరిగిన రెవిన్యూ సదస్సు లో ఆయన మాట్లాడారు రైతులకు 1బి అడంగల్ భూముల స్కెచ్ లు జనన మరణ ధ్రువపత్రాలు కుల ఆదాయ పత్రాలు వంటి సమస్యలు వెంటనే పరిష్కరిస్తామన్నారు సదస్సులో రెవెన్యూ అధికారులతో పాటు తెలుగుదేశం నాయకులు పాల్గొన్నారు.

## మంత్రి చేయూతతో కురుబ సంఘం నాయకులు శ్రీ భక్త కనకదాస విగ్రహాలు అందజేత

పెనుకొండ డిసెంబర్ 24 ప్రభాతవార్త



శ్రీ భక్త కనకదాస విగ్రహాలను కురుబలకు అందజేస్తున్న కురవ సంఘం నాయకులు

రాష్ట్ర బీసీ సంక్షేమ శాఖ జౌళి , చేనేత శాఖ మంత్రి సవిత చేయూతతో పలు గ్రామాల కురువ కులస్తులకు శ్రీ భక్త కనకదాస విగ్రహాలను కురుబ సంఘం నాయకులు అందజేశారు. మంత్రి సవిత తండ్రి మాజీ మంత్రి స్వర్గీయ రామచంద్రారెడ్డి జ్ఞాపకార్థం మంగళవారం పట్టణంలోని మంత్రి సవిత కార్యాలయంలో విగ్రహాలను అందజేశారు. నియోజకవర్గ పరిధిలోని పరిగి మండలంలోని వనంపల్లి రొద్దం మండలంలోని కలిపి గ్రామాలలోని కురబకులస్తులకు అందజేశారు. కార్యక్రమంలో కురుబ సంఘం నాయకులు నంజుండ వెంకట్ రాముడు సర్పంచ్ శ్రీనివాసులు చిన్న ముత్యాలురామాంజనేయులు రామకృష్ణ శివ ముత్యాలు పాల్గొన్నారు.

## ఏజిపి ఫకృబాషకు ఘన సన్మానం

గుత్తి, డిసెంబర్ 24 ప్రభాతవార్త



ఏజిపిని సన్మానించిన దృశ్యం

గుత్తి మున్సిఫ్ కోర్టు అసిస్టెంట్ గవర్నమెంట్ లీడర్‌గా నియాకమైన ఫకృబాషను మంగళవారం నూర్‌బాష ముస్లిం మైనార్టీ వెల్ఫేర్ సొసైటీ ఆధ్వర్యంలో ఘనంగా సత్కరించారు. తేదేపా ప్రభుత్వంలో నూర్‌బాషలకు గుర్తింపు ఇవ్వడం హర్షనీయమని నాయకులు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో సంఘం జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు వరిగడ్డి షాషావలి, మహబూబ్ బాష, మండల కమిటీ అధ్యక్ష, కార్యదర్శులు చాంద్‌బాష, కుళ్లాయి, మున్సిపల్ స్టాండింగ్ కౌన్సిల్ నూర్‌మహమ్మద్, తదితరులు పాల్గొన్నారు.

## గుత్తిలో వృద్ధురాలు ఆత్మహత్య

గుత్తి, డిసెంబర్ 24 ప్రభాతవార్త



వృద్ధురాలు మృతి చెందిన దృశ్యం

గుత్తి పట్టణంలోని ఎన్‌టిఆర్ సర్కిల్ సమీపంలో నివాసం వుండే లక్ష్మీదేవి (75) అనే వృద్ధురాలు మంగళవారం ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడింది. వ్యక్తిగత కుటుంబ సమస్యల కారణంగా ఆమె ఈ అఘాయిత్యానికి పాల్పడినట్లు తెలుస్తోంది. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

## విద్యుత్‌ఘాతానికి గురై వ్యక్తి మృతి

గుత్తి, డిసెంబర్ 24 ప్రభాతవార్త

మండలంలోని జి.ఎర్రగుడి గ్రామానికి చెందిన ఆంజనేయులు (35) అనే వ్యక్తి మంగళవారం విద్యుత్‌ఘాతానికి గురై మృతి చెందాడు. ఇతను పొలంలో నూర్పిడి యంత్రం వద్ద పనిచేస్తుండగా ఈ ప్రమాదం చోటు చేసుకుంది. బాధితున్ని ప్రభుత్వాసుపత్రికి తరలించగా అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు ధృవీకరించారు. పోలీసులు ఈ సంఘటనపై కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

## శ్రీవివేకానందపాఠశాలలో క్రిస్మస్ వేడుకలు

గుంతకల్లు, డిసెంబర్ 24 ప్రభాతవార్త



క్రిస్మస్ వేడుకల్లో పాల్గొన్న పాఠశాల యాజమాన్యం

పట్టణ శివారు లోని శ్రీవివేకానంద ఇంగ్లీష్ మీడియం పాఠశాలలో మంగళవారంక్రిస్మస్ వేడుకలను ఘనం గా నిర్వహించారు. ఈసందర్భంగా క్రీస్తు జన్మ వృత్తాం తాన్నివిద్యార్థులకు వివరించారు. ఈవేడుకల్లో పాఠశాలకరస్పాండెంట్ ఓంకా రప్ప,గురు,ప్రధానోపాధ్యాయురాలు నాగమణి,ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

## ప్రధానమంత్రి సూర్య ఘర్ యోజన వల్ల విద్యుత్ వినియోగదారులకు తక్కువ బిల్లు

### ఆరోగ్య మంత్రి సత్య కుమార్ యాదవ్ సూచన....

ధర్మవరం రూరల్ డిసెంబర్ 24 ప్రభాతవార్త

ధర్మవరం రెవిన్యూ డివిజన్ కార్యాలయంలో ప్రధానమంత్రి సూర్య ఘర్ యోజనపై అవగాహన కార్యక్రమం నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా రాష్ట్ర వైద్యారోగ్య శాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్ హాజరయ్యారు. ఈ కార్యక్రమాన్ని ఉద్దేశించి మంత్రి మాట్లాడుతూ, "ప్రధానమంత్రి సూర్య ఘర్ యోజన ద్వారా గృహ వినియోగదారులు అతి తక్కువ విద్యుత్ బిల్లు చెల్లించాల్సి వస్తుంది. ఇంటి పై కప్పుపై కనీసం 10 చ.మీ/100 చ.అ స్థలంలో 1 కిలో వాట్స్ సామర్థం కలిగిన సోలార్ రూఫ్ టాప్ ఏర్పాటు చేయడం ద్వారా తమ విద్యుత్ అవసరాలను స్వయంగా తీర్చుకోవచ్చు. ఈ పథకాన్ని సక్రమంగా అమలు చేసి, ప్రజలకు లబ్ది కల్పించడానికి ప్రభుత్వం చర్యలు తీసుకుంటోంది" అన్నారు. ప్రధాన మంత్రి సూర్య ఘర్ యోజన ద్వారా సౌరశక్తి వినియోగం పెరిగి, విద్యుత్ బిల్లు తగ్గించే అవకాశాలు ఉంటాయన్నారు. సోలార్ రూఫ్ టాప్ వ్యవస్థల ద్వారా అందరూ పర్యావరణ అనుకూలమైన శక్తిని ఉపయోగించి, విద్యుత్ వృథాను తగ్గించవచ్చు. ఈ పథకం ద్వారా ప్రజల ప్రయోజనాలు పెరుగుతాయని, ప్రభుత్వం అన్ని విధాలా సహకారం అందిస్తుందని మంత్రి తెలిపారు. ఈ కార్యక్రమంలో విద్యుత్ శాఖ డిఈ సురేంద్ర, ఆర్డీవో మహేష్, మున్సిపల్ కమిషనర్ ప్రమోద్ కుమార్, ఏ ఈ లు నాగభూషణం, కొండారెడ్డి, జానకిరామ్, బిజెపి జిల్లా అధ్యక్షులు జిఎం శేఖర్, సంధి రెడ్డి శ్రీనివాస్, టిడిపి నాయకులు చిగిచెర్ల ఓబిరెడ్డి, అధికారులు, కూటమి నాయకులు తదితరులు పాల్గొన్నారు.

09ATP27_09ATP27.qxd 24-12-2024 PM 10:58 Page 1



# కరెంటు చార్జీల బాదుడుపై 27న జరిగే పోరుబాటను జయప్రదం చేయండి

-పోస్టర్ల విడుదల కార్యక్రమంలో పిలుపునిచ్చిన వైఎస్సార్‌సీపీ నాయకులు



27న జరిగే కరెంటు చార్జీల బాదుడుపై వైఎస్సార్‌సీపీ పోరుబాట పోస్టర్లు విడుదల చేస్తున్న నాయకులు

ఉరవకొండ, డిసెంబర్ 24 ప్రభాతవార్త

వైఎస్సార్‌సీపీ అధినేత, మాజీ ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్మోహన్‌రెడ్డి పిలుపు మేరకు నియోజకవర్గ కేంద్రమైన ఉరవకొండలో ఈనెల 27న జరిగే కరెంటు చార్జీల బాదుడుపై వైఎస్సార్‌సీపీ పోరుబాట కార్యక్రమంలో ప్రజలు, వైఎస్సార్‌సీపీ శ్రేణులు పెద్దఎత్తున పాల్గొని వేలకోట్లు బాదుతున్న కూటమి సర్కార్‌పై నిరసన స్వరాన్ని తెలియజేయాలని వైఎస్సార్‌సీపీ నాయకులు పిలుపునిచ్చారు. పట్టణంలోని స్థానిక వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో మంగళవారం నాయకులు పోరుబాట పోస్టర్లను విడుదల చేశారు. ఈ సందర్భంగా ఉరవకొండ, కూడేరు ఎంపీపీలు ఎం.నరసింహులు, ఎం.నారాయణరెడ్డి, వైఎస్సార్‌సీపీ బీసీ విభాగం జిల్లా అధ్యక్షుడు సి.పి.వీరన్న, పంచాయతీరాజ్ విభాగం అధ్యక్షులు ఎం.బసవరాజు, పార్టీ ఉరవకొండ సమన్వయకర్త మూలగిరిపల్లి ఓబన్న, కూడేరు, వజ్రకరూరు మండలాల అధ్యక్షులు బైరెడ్డి రామచంద్రారెడ్డి, బి.సోమశేఖర్‌రెడ్డి తదితరులు మాట్లాడారు. నియోజకవర్గ కేంద్రంలో నిర్వహిస్తున్న వైఎస్సార్‌సీపీ పోరుబాటలో భాగంగా 27న నియోజకవర్గ ఇంచార్జ్, మాజీ ఎమ్మెల్యే వై.విశ్వేశ్వరరెడ్డి నేతృత్వంలో ఉదయం 9 గంటలకు పట్టణంలోని సెంట్రల్ హైస్కూల్ ప్రాంతం నుండి కరెంటు ఆఫీస్ వరకు నిరసన ర్యాలీ అనంతరం ధర్నా జరుగుతుందన్నారు. కూటమి ప్రభుత్వం గృహ వినియోగదారులపై మోపిన 15,485.36 కోట్ల విద్యుత్ చార్జీల బాదుడును వెనక్కి తీసుకోవాలని, ఎన్నికల్లో హామీ ఇచ్చిన విధంగా చార్జీల పెంపును నిలిపివేయాలని, ఎస్సీ, ఎస్టీలకు 200 యూనిట్ల ఉచిత విద్యుత్ కొనసాగించాలని డిమాండ్ చేయనున్నామన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీటీసీలు ఈడిగ ప్రసాద్, ఈశ్వర్‌బాబు, నాయకులు బి.ఆసిఫ్, నిమ్మల వెంకటరమణ, బి.మల్లికార్జున, కమ్మటి రామాంజినేయులు, అయ్యర్ దాదు, పచ్చిరవి, ఎర్రిస్వామి తదితరులు పాల్గొన్నారు.

# చిన్న, పెద్దముష్టూరు గ్రామాల్లో రెవెన్యూ సదస్సులు

-వివిధ రకాల భూమి సమస్యల పరిష్కారానికి 15 వినతులు



రెవెన్యూ సదస్సు దృశ్యం

ఉరవకొండ, డిసెంబర్ 24 ప్రభాతవార్త

మండల పరిధిలోని చిన్న, పెద్దముష్టూరు గ్రామంలో మంగళవారం



రెవెన్యూ సదస్సులో మాట్లాడుతున్న తహశీల్దార్ ఎస్.మహబూబ్‌బాషా

రెవెన్యూ సదస్సులు జరిగాయి. సదస్సులకు అధ్యక్షత వహించిన మండల తహశీల్దార్ ఎస్.మహబూబ్‌బాషా మాట్లాడుతూ దీర్ఘకాలిక భూమి సమస్యలను పరిష్కరించి స్వచ్ఛమైన భూమి రికార్డులను తయారు చేయాలన్న ఉద్దేశంతో రాష్ట్ర ప్రభుత్వం రెవెన్యూ సదస్సులను నిర్వహిస్తోందన్నారు. ఈ అవకాశాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకొని భూమి సమస్యలపై అర్జీలు అందిస్తే వాటిని క్షేత్రస్థాయిలో పరిశీలించి పరిష్కరించడం జరుగుతుందన్నారు. వివిధ రకాల భూమి సమస్యల పరిష్కారం కోరుతూ చిన్నముష్టూరులో 5, పెద్దముష్టూరులో 10 వినతులు అధికారులకు అందాయి. ఈ కార్యక్రమంలో మండల సర్వేయర్ రత్నాకర్‌బాబు, రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ రామకృష్ణ, దేవాదాయశాఖ మండల ఇంచార్జ్ విజయ్‌కుమార్, వీఆర్‌ఓలు అరుణ, సంధ్య, రాధ, గ్రామ సర్వేయర్లు వినోద్, జయరాం, టీడీపీ నాయకులు నెట్టెం రామకృష్ణ, సుభాష్ చంద్రబోస్, నెట్టం రాంబాబు తదితరులు పాల్గొన్నారు.

# బాల్య వివాహాల రహిత అనంతకు సమిష్టి కృషి అవసరం

-కిశోర వికాసం మండలస్థాయి శిక్షణా కార్యక్రమంలో వక్తలు

ఉరవకొండ, డిసెంబర్ 24 ప్రభాతవార్త

అనంతపురాన్ని బాల్య వివాహాల రహిత జిల్లాగా మార్చడానికి సమీష్టి కృషి అవరమని వక్తలు పేర్కొన్నారు. పట్టణంలోని వీరశైవ కళ్యాణ మండపంలో మంగళవారం కిశోరి వికాసం మండలస్థాయి శిక్షణా కార్యక్రమం మహిళా శిశు అభివృద్ధి పథకం ఉరవకొండ ప్రాజెక్టు ఆధ్వర్యంలో సీడీపీఓ డాక్టర్ బి.ఎస్.శ్రీదేవి అధ్యక్షతన జరుగగా ఎంపీడీఓ బి.వి.రవికుమార్, మండల విద్యాధికారి-2 బి.రమాదేవి, రాకెట్ల, పి.కౌకుంట్ల పీహెచ్‌సీల ఆరోగ్య విద్యా బోధకులు ఎస్.మహమ్మద్ షఫీ, యు.వెంకటరమణ, సీడీపీఓ ఎల్లమ్మ, మండల పరిషత్ ఏవో శంకర్, ఐసీడీఎస్ సూపర్‌వైజర్లు రాజమ్మ, రబియా, తిరుపాల్‌బాయి, విజయకుమారి, ఏఎస్‌ఐ శేక్షావలి, ఏపీఎం కాలేనాయక్ తదితరులు హాజరయ్యారు. ఈ సందర్భంగా వక్తలు మాట్లాడుతూ కాశోరి వికాసం శిక్షణ గ్రామంలో బడి మానేసిన ఆడపిల్లల కోసం ఏర్పాటు చేస్తారని గ్రామంలోని రిసోర్స్ గ్రూప్ ఇక్కడ శిక్షణ పొంది గ్రామాల్లో ఇకపై బాల్య వివాహాలు, బాల కార్మికులు ఉండకుండా వారు విద్యను కొనసాగించే విధంగా ఏదైనా నైపుణ్య శిక్షణా కార్యక్రమాలు ఏర్పాటు చేసి పిల్లల నైపుణ్యాన్ని పెంచి వారి కాళ్ళ మీద వారు నిలబడేలా చేయడం జరుగుతుందన్నారు. బాల్య వివాహాలు జరుగకుండా ప్రజలకు అవగాహన కల్పించి బాల్య వివాహాలు అరికట్టాల్సి ఉంటుందన్నారు. బాలికల్లో నెలసరి జరిగే మార్పు రుతుక్రమం, అనీమియా, పరిశుభ్రత, బడి మానేసిన పిల్లలను గుర్తించి బడిలో చేర్పించడం ఇందులో ముఖ్యమన్నారు. ఈ సందర్భంగా బాలల హక్కులను పరిరక్షించడం, మానవ అక్రమ రవాణా తదితర అంశాలను ఆయా శాఖల అధికారులు వివరించారు. ఈ కార్యక్రమంలో మహిళా పోలీస్, వెల్ఫేర్ అసిస్టెంట్లు, ఏఎన్‌ఎంలు, నోడల్ టీచర్లు, అంగన్‌వాడీ కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.



శిక్షణా కార్యక్రమంలో మాట్లాడుతున్న సీడీపీఓ డాక్టర్ బి.ఎస్.శ్రీదేవి

# 27న పెంచిన విద్యుత్ చార్జీల పై వైసిపి నిరసన

మాజీ ఎమ్మెల్యే దుద్దుకుంట శ్రీధర్ రెడ్డి



గోడపత్రికను విడుదల చేస్తున్న వైసీపీ నాయకులు

పుట్టపర్తి టౌన్ డిసెంబర్ 24 ప్రభాతవార్త

కూటమి ప్రభుత్వం పెంచిన విద్యుత్ ఛార్జీలకు నిరసనగా రాష్ట్రవ్యాప్తంగా వైసిపి పార్టీ ఆధ్వర్యంలో నిరసన తెలుపుతామని పుట్టపర్తి మాజీ శాసనసభ్యులు దుద్దుకుంట శ్రీధర్ రెడ్డి తెలిపారు. మంగళవారం స్థానిక వైసిపి కార్యాలయంలో విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాజీ ఎమ్మెల్యే మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత 15,500 కోట్లు విద్యుత్ భారాలు ప్రజలపై మోపుతున్నారని విమర్శించారు. అధికారంలోకి రాకముందు చంద్రబాబు విద్యుత్ ఛార్జీలు పెంచబోమని హామీ ఇచ్చి నేడు ప్రజల నడ్డి విరిచేందుకు పూనుకున్నారన్నారు. తాను ఎప్పుడూ నిజమే చెపుతానని చెప్పే పవన్ కళ్యాణ్ ఈరోజు పెంచిన విద్యుత్ చార్జీలపై ఎందుకు నోరు మెదపలేదని ప్రశ్నించారు. గత వైసిపి ప్రభుత్వ హయాంలో విద్యుత్ అంతరాయం లేకుండా ఇచ్చిన ఘనత వైయస్ జగన్ కే దక్కుతుందన్నారు. ప్రతి ఏటా ప్రతి ఇంటికి ఏదో ఒక పథకం అమలు చేశామని ప్రస్తుతం అధికారంలో ఉన్న కూటమి ప్రభుత్వం సూపర్ సిక్స్ పథకాలు ఎప్పుడు అమలు చేస్తారో చెప్పాలన్నారు. అమ్మ వడి ద్వారా విద్యార్థులకు ఎంతో మేలు జరిగిందని నేడు తల్లికి వందనం పేరుతో ఆ పథకం ఏమైందని ఆయన నిలదీశారు. ఎవరైనా ఏదైనా ప్రశ్నిస్తే వారిపై పోలీస్ కేసులు నమోదు చేస్తున్నారన్నారు. ఇప్పటికే పెన్షన్లు తొలగించే ప్రయత్నంలో కూటమి ప్రభుత్వం ఉందన్నారు. మూడు లక్షల పింఛన్లు తొలగించేందుకు సిద్ధం చేస్తున్నారని రాబోయే రోజుల్లో మరిన్ని పింఛన్లు కోత పెట్టేందుకు సిద్ధమవుతున్నారన్నారు. ప్రజలు ఈ విషయాలన్నీ గమనిస్తున్నారని ఇప్పటికైనా ఎన్నికలలో ఇచ్చిన హామీలను నెరవేర్చుకుంటే ప్రజలే కూటమి ప్రభుత్వానికి తగిన గుణపాఠం చెబుతారని హెచ్చరించారు. ఈనెల 27న పుట్టపర్తి జిల్లా కేంద్రంలోనీ విద్యుత్ ఎస్ ఈ కార్యాలయం ముందు ధర్నా చేపట్టడం జరుగుతుందని వైసిపి శ్రేణులు పెద్ద ఎత్తున పాల్గొని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా నిరసన తెలిపే గోడ పత్రికలను విడుదల చేశారు. ఈ కార్యక్రమంలో వైసిపి రాష్ట్ర కార్యదర్శి డి.ఎస్ కేశవరెడ్డి, కన్వీనర్లు రంగారెడ్డి, నరసారెడ్డి, మున్సిపల్ చైర్మన్ ఓబుళపతి, ఎంపీపీ ఏవి.రమణారెడ్డి, మాజీ అగ్రి బోర్డ్ అడ్వైజరీ చైర్మన్ ఆవుటాల రమణారెడ్డి, కౌన్సిలర్లు చెరువుభాస్కర్ రెడ్డి ,పవన్, వైసీపీ ఆ పార్టీ రాష్ట్ర మహిళా కార్యదర్శి సాయిలీల రెడ్డి, బిల్డర్ మల్లి, గోవర్ధన్ రెడ్డి, ఫోటో సాయి,తదితరులు పాల్గొన్నారు.

# నేడు క్రిస్మస్ డే పర్వదిన వేడుకలు

-ముస్తాబైన క్రైస్తవ ప్రార్థనా మందిరాలు

-రంగు రంగుల విద్యుత్ దీపాలతో కొత్త శోభ




క్రిస్మస్ వేడుకలకు ముస్తాబైన ఉరవకొండలోని సీఎస్ఐ చర్చి దృశ్యం

ఉరవకొండ, డిసెంబర్ 24 ప్రభాతవార్త

నేటి క్రిస్మస్ డే వేడుకలకు క్రైస్తవ ప్రార్థనా మందిరాలు కొత్త రంగులు, విద్యుత్ దీపకాంతుల నడుమ సర్వాంగ సుందరంగా ముస్తాబయ్యాయి. పట్టణ నడిబొడ్డులోని సీఎస్ఐ చర్చిను విద్యుత్ దీపాల తో శోభాయమానంగా తీర్చిదిద్దారు. క్రిస్మస్ పర్వదినాన్ని పురస్కరిం చుకొని గత మూడు రోజులుగా చర్చిల్లో సందడినెలకొంది. లోకరక్షకుడు యేసుక్రీస్తు జన్మదినాన్ని ఘనంగా నిర్వహిం చడానికి ఏర్పాట్లు పూర్తి అయ్యాయి. ప్రార్థనా మందిరాల్లో నక్షత్రాలు ఆకారాలు, క్రిస్మస్ ట్రీ, శాంతాక్లాస్ వేషదారణలు ప్రత్యేక ఆకర్షణగా నిలుస్తున్నాయి. బుధవారం ఉదయం నుండి సాయం త్రం వరకు ప్రత్యేక ప్రార్థనలు, సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించుకొని కేకులు కట్‌చేసి పరస్పరం క్రిస్మస్‌డే శుభాకాంక్షలు చెప్పుకోవడానికి సర్వ సిద్ధం చేశారు.

# యుటీఎఫ్ స్వర్ణోత్సవ మహాసభలను జయప్రదం చేయండి

-కరపత్రాల విడుదలలో యుటిఎఫ్ ఉరవకొండ జోన్ నాయకులు



కరపత్రాలను విడుదల చేస్తున్న యుటీఎఫ్ నాయకులు

ఉరవకొండ, డిసెంబర్ 24 ప్రభాతవార్త

జనవరి 5,6,7,8 తేదీల్లో కాకినాడలో జరిగే ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్ (యుటీఎఫ్) రాష్ట్ర స్వర్ణోత్సవ మహాసభలను జయప్రదం చేయాలని ఫెడరేషన్ జిల్లా సహాధ్యక్షులు రామప్పచౌదరి, జిల్లా ఆడిట్ మెంబర్ రాజశేఖర్ తదితరులు పిలుపునిచ్చారు. పట్టణంలోని స్థానిక యుటీఎఫ్ ప్రాంతీయ కార్యాలయంలో మంగళవారం వారు ఉరవకొండ జోన్ నాయకులతో కలిసి మహాసభల కరపత్రాలను విడుదల చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మహాసభల సందర్భంగా యుటీఎఫ్ ప్రచార జాతా ఈనెల 26న గుంతకల్లులో ప్రారంభమై ఉరవకొండ, రాయదుర్గం, కళ్యాణదుర్గం, అనంతపురం మీదుగా రాప్తాడు చేరుకుంటుందన్నారు. ప్రచార జాతాతోపాటు కాకినాడలో జరిగే స్వర్ణోత్సవ మహాసభల్లో ఉరవకొండ జోన్ నుండి అధిక సంఖ్యలో ఉపాధ్యాయులు హాజరై జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ఉరవకొండ మండల ప్రధాన కార్యదర్శి శ్రీనివాసులు, కోశాధికారులు బండయ్య, వేణుగోపాల్, గౌరవాధ్యక్షులు శ్రీనివాసగుప్త, జిల్లా కౌన్సిలర్లు నాగరాజు, రఘు, శ్రీధర్, కార్యదర్శులు మోహన్, ధనుంజయవర్మ, విడపనకల్లు మండల అధ్యక్షులు లక్ష్మినారాయణ, ప్రధాన కార్యదర్శి ఎర్రిస్వామి తదితరులు పాల్గొన్నారు.

# కోనాపురంలో కంది పంటలో పంటకోత ప్రయోగం

-వారం రోజులు ఆరబెట్టిన తరువాత తూకం వేస్తామన్న ఏడీఏ పద్మజ

ఉరవకొండ, డిసెంబర్ 24 ప్రభాతవార్త



కంది పంటలో పంటకోత ప్రయోగం నిర్వహణలో పాల్గొన్న ఏడీఏ పద్మజ

మండల పరిధిలోని కోనాపురం గ్రామంలో మంగళవారం కంది పంటలో పంటకోత ప్రయోగం నిర్వహించారు. వ్యవసాయశాఖ ఉరవకొండ సహాయ సంచాలకులు పద్మజ ఆధ్వర్యంలో గ్రామానికి చెందిన నెట్టెం మహేష్ అనే రైతు పోలంలో 5 ఇన్‌టు 5 మీటర్ల వ్యాసార్థంలో పంటను తొలగించారు. ఈ సందర్భంగా ఏడీఏ పద్మజ మాట్లాడుతూ పంట కోత ప్రయోగంలో భాగంగా కోసిన పంటను వారం రోజులపాటు ఆరబెట్టి ఆతర్వాత తూకం వేసి దిగుబడిని లెక్కించడం జరుగుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో రైతు సేవా కేంద్రం అగ్రికల్చర్ అసిస్టెంట్ చిక్కన్న, రైతులు నెట్టెం రామకృష్ణ, రామాంజినేయులు తదితరులు పాల్గొన్నారు.

# సీపీఎం జిల్లా కమిటి సభ్యులుగా బి.మల్లికార్జున ఎన్నిక

రాయదుర్గం, డిసెంబర్ 24 ప్రభాతవార్త:



సిపిఎం జిల్లా కమిటి సభ్యులు బి.మల్లికార్జున ఫైల్‌ఫోటో

అనంతపురంలో ఈ నెల 23,24వ తేదీల్లో జరిగిన సీపీఎం పార్టీ జిల్లా 14వ మహాసభల్లో సీపీఎం పార్టీ రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు ఆధ్వర్యంలో ఎన్నుకోబడిన జిల్లా కమిటిలో రెండవసారి సీపీఎం జిల్లా కమిటి సభ్యులుగా బి.మల్లికార్జునను ఎన్నుకున్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ నాపై నమ్మకం ఉంచి మరోసారి సీపీఎం పార్టీ జిల్లా కమిటిలో చోటు కల్పించిన రాష్ట్ర, జిల్లా నాయకులకు ధన్యవాదాలు తెలిపారు. అదే విధంగా పార్టీ తనకు అప్పచెప్పిన బాధ్యతలను సక్రమంగా నిర్వర్తిస్తూ, రాయదుర్గం ప్రాంతంలో సిపిఎం పార్టీ నిర్మాణానికి కృషి చేస్తానని, రాయదుర్గంలో రైతు, కార్మిక, వ్యవసాయ కూలీలు, ఉద్యోగులు, ఉపాధ్యాయులు, కర్షకులు, ఆసంగటితరంగా కార్మికులు ఎదుర్కొంటున్న సమస్యలపై సీపీఎం పార్టీ ఆధ్వర్యంలో రానున్న రోజుల్లో మరింత చురుగ్గా పోరాటాలను కొనసాగిస్తామని ఆయన పేర్కొన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అనుసరిస్తున్న ప్రజా వ్యతిరేక విదానాలపై రాజీలేని పోరాటాలను నిర్వహిస్తానని తెలియజేశారు.

# సంక్షేమ పథకాల కోతపెడితే సహించం

డేటా ప్రైవసీయా యాక్ట్ ఈనెల 30వ తేదిన

అమిత్‌షా వ్యాఖ్యలకు వ్యతిరేకంగా నిరసన

సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు

అనంతపురం క్లాక్ టవర్, డిసెంబర్ 24,ప్రభాతవార్త



సమావేశంలో మాట్లాడుతున్న దృశ్యం

బడ్జెట్‌ను మిగుల్చుకునేందుకు సంక్షేమ పథకాల్లో కొతపెడితే సహించబోమ నీ సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు ప్రభుత్వాన్ని హెచ్చరించారు. అనంతపురం నగరంలో రెండు రోజులుగా జరుగుతున్న జిల్లా మహాసభలో పాల్గొనేందుకు ఆయన మంగళవారం నాడు అనంతపురం విచ్చేశారు. మహాసభ జరుగుతున్నఎస్ఎన్ ఫంక్షన్ హాలులో ఆయన మీడియాతో మాట్లాడారు. అనర్హుల గుర్తింపు పేరుతో జరుగుతున్న సర్వేను ఆయన తప్పుబట్టారు. బడ్జెట్‌ను మిగుల్చుకునే క్రమంలోనే సర్వే పేరుతో అర్హుల గుర్తింపు కార్యక్రమం ప్రభుత్వం చేపడుతోందని విమర్శించారు. ఈ తొలగింపులు పార్టీల పరంగా గుర్తించి రాజకీయ వేదింపులకు ఉపయోగించుకునే అవకాశాలూ ఉన్నాయని చెప్పారు. గత ప్రభుత్వం కూడా ఇదే రకమైన చర్యలకు పాల్పడ్డారని తెలిపారు అదే విధంగా సర్వే పేరుతో కుటుంబ సమాచారం మొత్తాన్ని సేకరించి బయట కంపెనీలకు అప్పగించే అవకాశాలూ ఉన్నాయన్నారు. ఇప్పుడు డేటాను సేకరించడం ప్రయివేటు సంస్థలకు అప్పగించి సొమ్ము చేసుకోవడం జరుగుతోందన్నారు. అందుకే తాము డేటా ప్రైవసీ యాక్టును చేయాలని డిమాండ్ చేస్తున్నామని చెప్పారు. అమెరికా, యుకె ఎన్నికలను కూడా ఈ రకమైన డేటా ప్రభావితం చేసిందని గుర్తు చేశారు. ఇప్పటికైనా ప్రభుత్వాలు డేటాను సంరక్షించే చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు. కేంద్ర ప్రభుత్వం దొడ్డిదారినీ వ్యవసాయ రంగాన్ని ప్రయివేటుపరం చేయాలని చూస్తోందన్నారు. రైతుల పోరాట ఫలితంగా తిప్పికొట్టిన మూడు వ్యవసాయ చట్టాలను దొడ్డిదారిన అగ్రికల్చర్ మార్కెటింగు రిఫార్సు పేరుతో దేశంలో అమలు చేయించాలని చూస్తోందన్నారు. దీనికి చట్టంతో పనిలేకుండా రాష్ట్ర ప్రభుత్వాల ఆమోదంతో దొడ్డిదారిన అమలు చేయించే ప్రయత్నాలు జోరుగా చేస్తోందన్నారు. దీన్ని మన రాష్ట్ర ప్రభుత్వం ఆమోదించవద్దని సూచిస్తున్నామన్నారు దీని వలన రైతులకు తీరని నష్టం జరుగుతుందని పేర్కొన్నారు. రాజ్యాంగ నిర్మాత అంబేద్కర్ పట్ల కేంద్ర హోంమంత్రి చేసిన అనుచిత వ్యాఖ్యలపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. దీనికి వ్యతిరేకంగా ఈనెల 30వ తేదిన దేశ వ్యాప్తంగా నిరసనలు చేపట్టాలని నిర్ణయించడం జరిగిందన్నారు రాష్ట్రంలోని ఈ కార్యక్రమం చేపట్టనున్నట్టు ఆయన తెలిపారు. విద్యుత్ భారాలపై ఆయన మాట్లాడుతూ ఈ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ఎప్పుడూలేని విధంగా ట్రూప్ ఛార్జీల పేరుతో రూ.16 వేల కోట్లు భారాన్ని మోపిందన్నారు. స్మార్టు మీటర్లు పెడితే ధ్వంసం చేయాలని ప్రతిపక్షంలో ఉండగా నారా లోకేశ్ చెప్పియున్నారన్నారు. ఇప్పుడు ఆత్రం యధావిధిగా అమలు చేస్తున్నారని చెప్పారు. రాష్ట్ర ప్రభుత్వం తక్షణం ప్రజలపై మోపుతున్న భారాలను తగ్గించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు ఒ.నల్లప్ప, నాగేంద్రకుమార్ పాల్గొన్నారు.

# జనవరి 16 నుంచి జిల్లాకు ఉపలోకాయుక్త జడ్జి భేటీ

బళ్లారి, డిశంబర్24, ప్రభాతవార్త;



జిల్లాధికారి ప్రశాంత్‌కుమార్ మిశ్రా

కర్ణాటక ఉప లోకాయుక్త న్యాయమూర్తి బి.వీరప్ప జనవరి 16, 17, 18 తేదీల్లో మూడు రోజులపాటు బళ్లారి జిల్లాకు భేటీ చేయనున్నట్లు జిల్లాలో వివిధ ప్రభుత్వ శాఖలకు సంబంధించి పెండింగ్‌లో ఉన్న లోకాయుక్త ఫిర్యాదుల విచారణ, పరిష్కరణ కార్యక్రమం జరగనున్నట్లు, అవసరమైన సమాచారంతో ఉప లోకాయుక్త అన్ని కార్యక్రమాల్లో హాజరుకావాలని జిల్లాధికారి ప్రశాంత్‌కుమార్ మిశ్రా జిల్లాస్థాయి అధికారులకు సూచించారు. సోమవారంనాడు జరిగిన వి.సి. ముందస్తు సభలో మాట్లాడుతూ ఆయాశాఖల అధికారులు తమశాఖల పరిధిలోని లోకాయుక్తకు చేసిన ఫిర్యాదులకు సంబంధించి అన్ని ఫైళ్లను దగ్గర పెట్టుకొని ఉప లోకాయుక్త న్యాయమూర్తికి అందుబాటులో ఉండాలని ఆదేశించారు. కేసులు పరిష్కారంగాకుండా పెండింగ్‌లో ఉంటే అందుకు కారణాలు కూడా ఉపలోకాయుక్త దృష్టికి తీసుకురావాలని సూచించారు. పెండింగ్‌లో ఉన్న లోకాయుక్త ఫిర్యాదు అర్జీలను తక్షణం పరిష్కరించే చర్యలు తీసుకోవాలన్నారు. పరిష్కరించే సమయంలో చట్టం పరిధిలో అవకాశం ఉంటే ఫిర్యాదుదారులకు ముందుగా నోటీసుల ద్వారా తెలపాలని చెప్పారు.

# మిర్చి మార్కెట్‌కై బళ్లారి ఏపీఎంసీ బంద్.... రైతులచే భారీ ప్రతిఘటన



మిర్చి మార్కెట్ స్థాపనకై డిమాండ్ చేస్తూ ఏపీఎంసీ బంద్ చేసి ర్యాలీ ప్రదర్శనచేపట్టిన రైతులు



ఏపీఎంసీలో బంద్ దృశ్యం

బళ్లారి, డిశంబర్24, ప్రభాతవార్త;

బళ్లారిలోనే ఎండుమిరపకాయల మార్కెట్‌ను ప్రారంభించాలని నగరంలోని ఏపీఎంసీ మార్కెట్ వ్యాపార లావాదేవీలను బంద్ చేయడంతోపాటు వేలాది సంఖ్యలో రైతులు నిరసన ర్యాలీ ప్రదర్శన చేపట్టిన ప్రతిఘటన జరిపారు. జిల్లా ఛేంబర్, కామర్స్ సంస్థ నేతృత్వంలో కన్నడనాడు రైతు సంఘం, ఏపీఎంసీ ట్రేడర్స్ అసోసియేషన్, దళారీ వర్తకుల సంఘం, హమాలీల సంఘాల సంయుక్తాధ్వర్యంలో రైతులు రాష్ట్ర ప్రభుత్వానికి నినాదాలు చేస్తూ జిల్లా యంత్రాంగం ద్వారా సందేశం పంపుతూ నిరసన వ్యక్తం చేశారు. ఏపీఎంసీ మార్కెట్‌లో అన్ని దుకాణాలు బంద్ చేసి వ్యాపారులు కూడా రైతుల ప్రతిఘటనకు తమ మద్దతు ప్రకటించడం విశేషం. ఏపీఎంసీ మార్కెట్‌లో చేరుకున్న రైతులు అక్కడి నుంచి నగరంలోని బెంగళూరు రోడ్డు, రాయల సర్కిల్‌కు చేరుకుని సుమారు గంటసేపు మానవహారం చేపట్టారు. అనంతరం డి.సి. కార్యాలయానికి చేరుకుని రాష్ట్ర ప్రభుత్వానికి రాసిన వినతి పత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంలో మాట్లాడిన ఛేంబర్ ఆఫ్ కామర్స్ సంస్థ పదాధికారులు, రైతు నాయకులు బ్యాడిగి మార్కెట్‌కు ఈ ప్రాంతం నుంచి అధిక స్థాయిలో ఎండుమిరప కాయలు తీసుకెళ్తారని, దీని వల్ల రైతులు అనేక సమస్యలు ఎదుర్కొంటున్నారని, ముఖ్యంగా బళ్లారి నుంచి బ్యాడిగి చాలా దూరంగా ఉండడంతో వ్యయ ప్రయాసాలతో అధిక ఖర్చులు భరించి మిరప కాయలు అమ్ముకోవాల్సిన పరిస్థితి ఉన్నదని, అదే బళ్లారి నగరంలో మిర్చి మార్కెట్‌ను ప్రారంభిస్తే తమకు ఈ కష్టాలు ఉండవని రైతులు వాపోయారు. మార్కెట్ స్థాపనకై తాలూకాలోని ఆలదహళ్లి వద్ద ఇప్పటికే తగినంత భూమిని స్వాధీనం చేసుకోవడం జరిగింది. రాష్ట్ర ప్రభుత్వం సదరు ప్రాంతంలో మిర్చి మార్కెట్‌ను చేస్తామని చెప్పింది. ప్రయివేట్ సంస్థ భాగస్వామ్యంతో మిర్చి మార్కెట్‌ను నిర్మించేందుకు టెండర్లు పిలవగా ఎవరూ రాని కారణంగా ఇప్పటివరకు మార్కెట్ స్థాపన జరగలేదని, మార్కెట్‌కు కేటాయించిన స్థలంలో ప్రస్తుతం అక్కడ ఏసీ గోడౌన్‌లు నిర్మించేందుకు మాత్రమే ప్రభుత్వం ఆమోదం తెలిపిందని, మార్కెట్ ప్రారంభించేందుకు ప్రభుత్వం ఎటువంటి నిర్ణయం తీసుకోలేదన్నారు. తక్షణమే ప్రభుత్వం స్పందించకపోతే తాము ఉగ్ర పోరాటం జరుపుతామని హెచ్చరించారు. మిర్చి మార్కెట్ స్థాపన జరిగేంతవరకు బళ్లారి ఏపీఎంసీ మార్కెట్‌లోనే మిర్చి మార్కెట్ స్థాపన జరిగేలా చూడాలని జిల్లా యంత్రాంగానికి, రాష్ట్ర ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. ఈ సందర్భంలో రైతు సంఘాల నాయకులైన మెనసిన ఈశ్వరప్ప, వి.రామచంద్ర, దరూరు పురుషోత్తంగౌడ, వి.ఎస్.శివశంకర్, గుర్లల్లి రాజా, సంగనకల్ క్రిష్ణ, పి.పాలన్న తదితరులు పాల్గొన్నారు.

# బళ్లారిలో 88వ అఖిల భారత కన్నడ సాహిత్య సమ్మేళనం

- జిల్లా ప్రజల ఆకాంక్ష నెరవేరింది... జిల్లా సాహిత్య కన్నడ పరిషత్ అధ్యక్షుడు నిష్టి రుద్రప్ప

బళ్లారి, డిశంబర్24, ప్రభాతవార్త;



పత్రికాగోష్టిలో మాట్లాడుతున్న కన్నడ సాహిత్య పరిషత్ జిల్లాధ్యక్షుడు నిష్టి రుద్రప్ప

2025 సంవత్సరంలో 88వ అఖీల భారత కన్నడ సాహిత్య పరిషత్ సమ్మేళనాన్ని బళ్లారిలో జరిపేందుకు కన్నడ సాహిత్య పరిషత్ నిర్ణయించడం హర్షదాయకమని, ఎన్నో రోజుల జిల్లా ప్రజల ఆకాంక్ష నెరవేరినట్లయ్యిందని జిల్లా సాహిత్య కన్నడ పరిషత్ అధ్యక్షుడు నిష్టి రుద్రప్ప తెలిపారు. నగరంలో మంగళవారంనాడు పత్రికాగోష్టిలో మాట్లాడిన ఆయన మండ్యాలో మూడు రోజులపాటు 87వ సమ్మేళనం అత్యంత ఘనంగా, వైభవోపేతంగా వేలాదిమంది సాహితీప్రియుల సమక్షంలో విజయవంతంగా జరిగిందని చెప్పారు. సమ్మేళనంలో జరిగిన పరిషత్ కార్యవర్గ సమితి సభలో బళ్లారితోపాటు రాష్ట్రంలోని 12 జిల్లాల నుంచి తదుపరి సమ్మేళనం తమ జిల్లాలో జరిపేందుకు అవకాశం ఇవ్వాలని డిమాండ్ చేసినట్లు, చివరగా బళ్లారికి అవకాశం లభించడం బళ్లారి ప్రజల అదృష్టమని చెప్పారు. 67 సంవత్సరాల తర్వాత 88వ అఖీల భారత కన్నడ సాహిత్య సమ్మేళనం బళ్లారిలో జరుగుతుండడం గొప్ప విషయమని, 1920లో స్వాతంత్ర్యానికి పూర్వం మొదటిసారిగా అఖండ బళ్లారి జిల్లా హోస్పేటలో శ్రీనివాస్‌రాయరు అధ్యక్షతన 6వ సమ్మేళనం జరిగింది. రెండోసారిగా 1926 మే 22వ తేదీ నుంచి 24వ తేదీ వరకు మూడు రోజులపాటు 12వ సమ్మేళనం బళ్లారి నగరంలో జరిగిందని పేర్కొన్నారు. అనంతరం 12 సంవత్సరాల తర్వాత మూడోసారి 1938 డిశంబర్ 29వ తేదీ నుంచి 31వ తేదీ వరకు 23వ సాహిత్య సమ్మేళనం ఆర్‌ఆర్ దివాకర్ అధ్యక్షతన జరుగగా, నాలుగోసారి 1947లో పరప్పనహళ్లిలో, అనంతరం 1958 జనవరి 18వ తేదీ నుంచి 20వ తేదీ వరకు బళ్లారి నగరంలోని మున్సిపల్ కాలేజీ మైదానంలో 5వ సారిగా జరిగింది. ఈ ఐదు సమ్మేళనాల అనంతరం పలుసార్లు బళ్లారిలో అఖీల భారత సాహిత్య సమ్మేళనం జరపాలన్న పట్టుదలతో 2004 నుంచి విజ్ఞప్తి చేస్తున్నా అవకాశం లభించలేదని తెలిపారు. ఎట్టకేలకు 88వ సమ్మేళనాన్ని పొరుగున గల ఆంధ్రప్రదేశ్‌లోని సరిహద్దు కన్నడిగులకు కూడా అనుకూలమయ్యేవిధంగా బళ్లారి నగరంలోనే సమ్మేళనం జరిగేలా జిల్లా కార్యవర్గ సమితి తీర్మానించిందని చెప్పారు. మూడు రోజులపాటు మూడు వేదికలపై కన్నడ సాహిత్యానికి సంబంధించి కవిగోష్టిలు, చర్చా సదస్సులు, కన్నడ భాషకు సంబంధించి వివిధ రచనా సంపుటాల విడుదలతో పాటు కన్నడ సంస్కృతి, సంప్రదాయం, సంగీత, నృత్య, నాటక, జానపద కళారంగాలకు సంబంధించి ప్రదర్శనలు ఆవిష్కృతమవుతాయని, రాష్ట్రంతోపాటు రాష్ట్రంలోని అన్ని జిల్లాల నుంచి, భారతదేశంలోని కన్నడ సాహితీప్రియులందరూ ఈ సమ్మేళనంలో భారీ సంఖ్యలో పాల్గొంటారని, అలాగే విదేశాల నుంచి సమ్మేళనంలో పాల్గొనేందుకు ప్రతినిధులు హాజరవుతారని వెల్లడించారు. కన్నడ సంఘసంస్థలకు చెందిన పదాధికారులు సాహిత్య సమ్మేళనాన్ని జయప్రదం చేసే దిశలో ఇప్పటి నుంచే కార్యాచరణ రూపొందించేందుకు, తమ కన్నడ సాహిత్య పరిషత్‌కు సహకరించాలని విజ్ఞప్తి చేశారు. ఈ సందర్భంలో పరిషత్ జిల్లా మాజీ అధ్యక్షులు హంపన్నగౌడ, సిద్ధరామ కల్మట, జిల్లా కార్యదర్శి డా.శివలింగప్ప, చోరనూరు కొట్రప్ప, డా.బసవరాజ్, కె.వి.నాగిరెడ్డి, కోళూరు వెంకటేష్‌హెగడే తదితరులు పాల్గొన్నారు.

